RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 154 | మే 13, 2025 | వెల : రూ.3-00




జన హితం కోసమే
## జన విజ్ఞాన వేదిక
4లో..








బంధన్ హాస్పిటల్ లో విచారణ చేపట్టిన హన్మకొండ జిల్లా వైద్య అధికారులు

# మృత్యు ఒడి.. బంధన్!

## రోగుల ప్రాణాలతో ప్రైవేటు ఆస్పత్రి చెలగాటం

- చర్యలకు జంకుతున్న వైద్యారోగ్యశాఖ అధికారులు
- గతంలో ఓ జర్నలిస్టును జీవితపు చరమాంకం తీసుకెళ్లేలా నిర్లక్ష్యపు వైద్యం
- తాజాగా ఏకంగా ఓ ప్రాణాన్నే తీసేశారంటూ మృతుడి బంధువులు ఫైర్
- సామాన్యులతో ఆటలాడుతున్న ఆస్పత్రిపై పట్టింపు లేని వ్యవస్థపై బాధితుల ఆగ్రహం
- సదరు హాస్పిటల్‌పైన చర్యలు తీసుకోవడానికి ప్రజాప్రభుత్వానికి జంకు ఎందుకు?
- మరిన్ని ప్రాణాలు పోతేనే ఉన్నతాధికారులు స్పందిస్తారా?: నగరవాసుల ఆవేదన

**వేద న్యూస్, వరంగల్ :**

గ్రేటర్ వరంగల్ నగరం హన్మకొండలోని బంధన్ హాస్పిటల్ రోగుల మృత్యు ఒడిగా మారిందని బాధితులు ఆరోపిస్తున్నారు. అర్హత, అనుభవం లేని వైద్యుల ట్రీట్‌మెంట్ చేయడం వల్లే నిండు ప్రాణం కోల్పోయామని బాధితులు వెల్లడిస్తున్నారు. ప్రమాదం నుంచి మనుషులను కాపాడి పునర్జన్మిచ్చే దేవుళ్లుగా వైద్యులను ఆరాధిస్తామని.. కానీ, సదరు ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్ల తీరుతో వైద్య వ్యవస్థకు అపఖ్యాతి ఏర్పడుతోంది. గతంలో అపెండిక్స్ ఆపరేషన్‌లో సర్జరీ, పోస్ట్ ఆఫ్ కేర్‌లో నిర్లక్ష్యం వహించి.. ఓ జర్నలిస్టును జీవితపు చరమాంకం వరకు తీసుకెళ్లారు. నెలల పాటు సదరు పాత్రికేయుడు మంచానికి పరిమితమై.. ఇప్పటికీ 'బంధన్' వైద్యుల నిర్లక్ష్యం వల్ల అనారోగ్యంతో నెట్టుకొస్తున్నాడు. సదరు హాస్పిటల్‌పై ఉన్నతాధికారులకు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. తాజా బంధన్ ఆస్పత్రిలో ఓ వ్యక్తి ప్రాణం కోల్పో వడంతో నగరంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

### అనుభవం లేకున్నా వైద్యం..

బీఏఎంఎస్, ఫామ్ డీ డాక్టర్లు వైద్యం చేయడం వల్లే తమ తండ్రి మహేందర్‌రావు మృతి చెందినట్టు మృతుడి కూతురులు ఆరోపించారు. సోమవారం హాస్పిటల్ ఎదుట తమకు న్యాయం చేయాలని ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

మృతుడి కుటుంబీకుల వివరాల ప్రకారం.. వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన మహేందర్‌రావు అనే వ్యక్తి ఆదివారం కడుపు నొప్పితో.. హన్మకొండలోని బంధన్ ఆసుపత్రికి తీసుకు వెళ్ళారు. అక్కడ పలు రకాల పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. సోమవారం ఉదయం మహేందర్‌రావు మృతి చెందారని ఆస్పత్రి వారు తెలపడంతో కుటుంబీకులు ఆందోళన చేపట్టారు.

### నిపుణులు లేకున్నా హంగు ఆర్భాటాలతో ట్రీట్‌మెంట్..

తన తండ్రికి బంధన్ హాస్పిటల్‌లో బీఏఎంఎస్, ఫామ్ డీ డాక్టర్లు వైద్యం చేయడం వల్లే తన తండ్రి మృత్యు ఒడిలోకి వెళ్లాడని ఆరోపించారు. నిపుణులైన అర్హత కలిగిన డాక్టర్లు లేకుండా ట్రీట్‌మెంట్ ఎలా చేశారని ప్రశ్నించగా, కేసు కాంప్లికేట్ అయిందని అయినా వైద్యం సరిగ్గానే చేశామని వైద్యులు పేర్కొన్నారని వెల్లడించారు. తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి బంధన్ హాస్పిటల్ యాజమాన్యం మృతుడి కుటుంబ సభ్యులు పెద్ద దిక్కు కోల్పోయి ఉన్న ముగ్గురు కూతురులతో చర్చలు చేసినట్టు తెలుస్తోంది. ఇందుకు పలువురు మధ్యవర్తిత్వం చేసి మృతుడి కుటుంబ సభ్యులకు తూతూ మంత్రంగా

మిగతా 4వ పేజీలో..

### విచారణ చేపట్టిన జిల్లా వైద్యాధికారులు

బంధన్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ తండ్రి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ధర్నా చేయడంతో విషయం తెలుసుకున్న హనుమకొండ జిల్లా వైద్యాధికారి బృందం హాస్పిటల్ కి వెళ్లి విచారణ చేపట్టింది.



మత్స్యగిరి స్వామి దేవాలయానికి
## జనరేటర్ బహుకరణ

**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయానికి శాయంపేట గ్రామానికి చెందిన క్రీస్తుశేషులు మామిడి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మామిడి ప్రమోద్, త్రిశూల్, సాయిక్రిష్ణలు కలిసి ముప్పై ఐదు వేల రూపాయల విలువ కలిగిన జనరేటర్‌ను సోమవారం దేవాలయ చైర్మన్ సామల బిక్షపతికి అందజేసినారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యలు ప్రత్యేక పూజలు చేసినారు. ఈ కార్యక్రమంలో దాసరి వేణు, కల్పన పాల్గొన్నారు.




మూడ్రోజులకే మూతపడుతున్న
## రేషన్ దుకాణాలు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

ఏ ముహూర్తాన రాష్ట్ర ముఖ్యమంత్రి ఉగాది పండుగ నుంచి రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారో అప్పటినుండి చౌక ధరల దుకాణాలు మూడు రోజులకే మూతపడుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట, మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న చౌక ధరల దుకాణాలకు వస్తున్న సన్న బియ్యం మూడు రోజుల్లోనే అయిపోతున్నాయని డీలర్లు తెలుపుతున్నారు. క్షేత్రస్థాయిలో వేద న్యూస్ ప్రతినిధి వివిధ జాతీయ ఉత్పత్తి పంపిణీ దుకాణాలను సందర్శించగా అక్కడ డీలర్లు గతంలో స్టాక్ వచ్చినప్పుడు వారం పది రోజులు బియ్యం పంపిణీ చేసే వారమని కానీ ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీ జరుగుతూ ఉండడంతో స్టాక్ వచ్చిన నాటి నుండే తండోప తండాలుగా వినియోగదారులు షాప్‌కు రావడం బియ్యాన్ని తీసుకు వెళ్లడంతో మిగిలిన రోజులు విశ్రాంతి లభిస్తుందని డీలర్లు తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం కేవలం పిండి పదార్థాలు తయారు చేసేందుకు లేదా ఇతరులకు అమ్ముకునేందుకు ప్రజలు ముందుకు వచ్చేవారని ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం గృహ వినియోగానికి వినియోగిస్తున్నామని కడుపునిండా మూడు పూటలా భోజనం చేస్తున్నామని వినియోగదారులు తెలిపారు. ఏది ఏమైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందజేస్తున్న సన్న బియ్యం పేదలకు ఉపయోగపడడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

భావిభారత పౌరులు
## దృఢంగా ఉండాలి

- తల్లిదండ్రులు, గురువులు చెప్పేది బుద్దిగా నేర్చుకోవాలి
- జిల్లా ఎస్పీ నరసింహ

వివరాలు 4లో..

ప్రమాదవశాత్తు మొక్కజొన్న
## కంకి, వరి ధాన్యం దగ్ధం

### సుమారు మూడు లక్షల పండించిన పంట నష్టం

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు పంట వ్యర్థాలను కాల్చడం వలన మొక్కజొన్న కంకి, వరి ధాన్యం పూర్తిగా దగ్ధం అయింది. మండల వ్యవసాయ అధికారి గంగా జమున తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలంలో పత్తిపాక గ్రామానికి చెందిన అన్నబోయిన రఘుపతి రైతు పంట పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు పంట వ్యర్థాలను కాల్చే క్రమంలో సుమారు మూడు ఎకరాల ముప్పై ఆరు గుంటలలో పండించిన మొక్కజొన్న కంకి పూర్తిగా దగ్ధమైంది. ఒకటిన్నర ఎకరంలో పండించిన వరి ధాన్యం కుప్ప అరవై శాతం దగ్ధమైంది. రెండు పంటలకు గాను సుమారు మూడు లక్షల పంట జరిగిందని తెలిపారు. రైతు సోదరులకు మండల వ్యవసాయ అధికారి తగు సూచనలు చేశారు.పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా కలిగే నష్టాలను అనేకమార్లు వివరించడం జరిగింది అన్నారు.అయినా కూడా కొన్ని చోట్ల అదే పద్ధతిని కొనసాగిస్తున్నారు ఇక మీదట అయినా ఇట్టి పద్ధతిని స్వస్తి పలకవలసిందిగా విజ్ఞప్తి చేశారు. పంట వ్యర్థాలను కాల్చడం వలన చాలా నష్టాలు ఉన్నాయి, వాయు కాలుష్యం, భూమి సారం క్షీణించడం, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టం వంటివి కొన్ని ప్రధాన నష్టాలు కలుగుతాయి.పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రియ కర్బన శాతం తగ్గుతుంది. దీనితో భూసారం తగ్గుతుంది. కొంత కాలానికి భూమి నిస్సారంగా మారుతుంది. పర్యావరణం దెబ్బతింటుంది, విషవాయులు విడుదల అవుతాయి కాబట్టి వాయు కాలుష్యానికి కారణం అవుతుంది. పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుంది. ఆరోగ్యకరమైన నేల, పంటను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వివరించారు.

# చావో రేవో తేల్చుకుంటాం..


- సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ముట్టడి
- పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి
- భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్



**వేద న్యూస్, సూర్యాపేట :**

రాబోయే పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పించేంతవరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై చావో రేవో అనే రీతిలో పోరాటాలను ఉధృతం చేస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. సోమవారం పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు అధ్యక్షతన నిర్వహించిన సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఒకలా ఎన్నికల తర్వాత మరోలా ప్రవర్తిస్తూ తెలంగాణ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండి పడ్డారు. ముఖ్యంగా సమాజంలో అట్టడుగున ఉండి దుర్భర జీవితాలు గడుపుతున్న వికలాంగుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న తీరు తెలంగాణ వికలాంగుల సమాజాన్ని ఎంతో ఆవేదనకు గురిచేస్తుందని అన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే తెలంగాణలో వికలాంగుల పింఛన్లను రూ. 6000కు పెంచుతామని ఆర్టీసీలో వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యంగా రాజస్థాన్ చతిస్గడ్ తరహాలో తెలంగాణలోనూ పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని రాష్ట్రంలో వికలాంగుల అట్రా చిట్టి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా గుర్తించి ప్రత్యేక అధికారులను నియమిస్తామని కాంగ్రెస్ పార్టీ అభయ అస్త్రం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న నాటి పీసీసీ అధ్యక్షుడు నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఎందుకు ఎనకడుగు వేస్తున్నారో వికలాంగుల సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహించేందుకు ముందుకు వెళ్లాలని పంచాయతీ ఎన్నికల్లో వికలాంగుల రాజకీయ రిజర్వేషన్ తేల్చకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు వెళితే తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికల్లో అయినా కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయడమే లక్ష్యంగా తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఈ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో సంఘం నాయకులు వీరమ్మ,బిక్షం, ఉప్పునూతల నరసయ్య, మట్టపల్లి పూలమ్మ,ఆరూరి బాబు,నరేష్ రెడ్డి,కొండ సైదులు,యాదవ్ మున్న, మధు యాదవ్,పేర్ల సోమయ్య యాదవ్,జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## రాత్రిళ్లు పదేపదే మెలకువ వస్తుందా?



**వేద న్యూస్, డెస్క్ :** ఇటీవలి కాలంలో చాలా మంది నిద్రలేమితో బాధపడుతున్నారు. రాత్రిపూట తగినంత నిద్ర లేకపోవడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కొంతమంది ఉదయం వరకు హాయిగా నిద్రపోతుంటారు. కానీ మరికొందరు రాత్రి నిద్రలో పదే పదే మేల్కొంటారు. మన ఆరోగ్యానికి రాత్రి నిద్ర చాలా ముఖ్యం. మంచి నిద్ర మనల్ని రోజంతా ఉత్సాహంగా ఉంచుతుంది. కానీ ఇటీవలి కాలంలో చాలా మంది నిద్రలేమితో బాధపడుతున్నారు. రాత్రిపూట తగినంత నిద్ర లేకపోవడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కొంతమంది ఉదయం వరకు హాయిగా నిద్రపోతుంటారు. కానీ మరికొందరు రాత్రి నిద్రలో పదే పదే మేల్కొంటారు. అంతే కాకుండా నిద్రలో విశ్రాంతి లేకపోవడం కూడా ఒక సాధారణ సమస్యగా మారింది. ఇలాంటి కారణాల వల్ల శరీరానికి అవసరమైన నిద్ర లభించదు. ఇవన్నీ మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. రాత్రి సరిగ్గా నిద్రపోకపోవడానికి ఈ కింది అలవాట్లే కారణమని నిపుణులు అంటున్నారు. మన శరీరానికి మంచి ఆహారం, వ్యాయామంతో పాటు, మంచి నిద్ర కూడా చాలా ముఖ్యం. సరైన నిద్ర కారణంగానే మంచి ఆరోగ్యం సాధ్యమవుతుంది. మన మెదడు సరిగ్గా పనిచేయడానికి నిద్ర కూడా అవసరం. మీరు సరిగ్గా నిద్రపోకపోతే అది మీ శరీరం, మనస్సుపై ప్రభావం చూపుతుంది. ఈ రకమైన అభ్యాసం అనేక రకాల వ్యాధులకు దారితీస్తుంది. వీటిలో గుండె జబ్బులు, ఊబకాయం, మధుమేహం, మూత్రపిండాల వ్యాధి, మెదడు సంబంధిత వ్యాధులు, అలాగే అల్జీమర్స్, చిత్తవైకల్యం, ఆందోళన, నిరాశ వంటి తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. వీటన్నింటినీ నివారించడానికి రాత్రిపూట నిద్రపోవడం చాలా అవసరం. రాత్రిపూట సరిగ్గా నిద్రపోకపోవడానికి నాలుగు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటి కారణం టీవీ, మొబైల్ లేదా ల్యాప్‌టాప్ ఎక్కువగా చూడటం, రెండవది మొబైల్ వాడటం లేదా రాత్రి పొద్దుపోయే వరకు ల్యాప్‌టాప్‌లలో పనిచేయడం. మూడవది పడుకునే ముందు నీరు లేదా ఇతర ద్రవాలు తాగడం వల్ల కూడా నిద్రకు అంతరాయం కలుగుతుంది. ఈ రకమైన అలవాట్ల వల్ల, మీరు రాత్రిపూట తరచుగా మూత్ర విసర్జనకు వెళ్ళవలసి వస్తుంది. ఇలాంటి సదర్భంలో బాగా నిద్ర పట్టదు. అదనంగా రాత్రిపూట ఎక్కువగా తినడం కూడా మంచి నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. నాల్గవది శరీరంలో విటమిన్ డి లేకపోవడం. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోకపోవడం కూడా మంచి నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. ఇంకా నిద్రలేమి, స్లీప్ అప్నియా, రెస్ట్‌లెస్ లెగ్ సింగ్రోమ్ వంటి నిద్ర సంబంధిత పరిస్థితులు కూడా నిద్రలేమికి ముఖ్యమైన కారణాలు.

## ఈ టీ అందరికీ మంచిది కాదట..!



**వేద న్యూస్, డెస్క్ :** ప్రస్తుత రోజుల్లో మనలో చాలా మంది సాధారణ టీకి బదులు లెమన్ టీని ఎంచుకుంటున్నారు. ఇందులో ఉండే విటమిన్ జ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు, శరీరం డిటాక్స్ అవడంలో సహాయపడతాయనే నమ్మకం వల్ల దీని వినియోగం పెరుగుతుంది. అయితే కొన్ని ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు దీన్ని తాగడం వల్ల మరిన్ని సమస్యలు ఎదురవుతాయి. అలాంటి సందర్భాల్లో దీన్ని ఉపయోగించకపోవడం మంచిది. పుల్లటి వాటితో పడని వాళ్లు జాగ్రత్తగా ఉండాలి. కొందరికి నిమ్మకాయ, పుల్లటి రుచులు పడవు. తిన్న వెంటనే చర్మం ఎర్రగా అవ్వడం, పొడిబారడం, ఊపిరి తీసుకోవడంలో కష్టం కలగడం లాంటివి జరగవచ్చు. ఇది అలెర్జీ అని గుర్తుపెట్టుకోవాలి. అలాంటి వాళ్లు నిమ్మకాయ టీ తాగితే ఒంట్లో సమస్యలు ఎక్కువ అవుతాయి. ఎసిడిటీతో బాధపడుతున్నవారు.. పొట్టలో మంట ఎక్కువగా ఉండేవాళ్లు నిమ్మకాయ టీ తాగితే ఆ మంట ఇంకా ఎక్కువయ్యే ఛాన్స్ ఉంది. దానివల్ల జిడ్డుగా అనిపించడం, బాగోలేనట్టు ఉండటం లాంటి ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. నిమ్మకాయలో ఉండే పులుపు పొట్టలో మంటను పెంచుతుంది. పళ్లు బలహీనంగా ఉన్నవాళ్లు ఈ టీ తాగకూడదు. నిమ్మరసంలో ఉండే పులుపు నిమ్మకాయ టీలో కూడా ఉంటుంది. దాని ఎఫెక్ట్ నేరుగా పళ్ల మీద ఉండే పొర (ఎనామిల్) మీద పడుతుంది. దీనివల్ల పళ్లు బలహీనంగా అవ్వడం, తియ్యటివి, చల్లటివి తింటే నొప్పి రావడం లాంటి సమస్యలు వస్తాయి. ముందే పళ్లు బాగోలేకపోతే ఈ టీ తాగడం వల్ల ఈ సమస్యలు ఇంకా ఎక్కువయ్యే అవకాశం ఉంది. మైగ్రేన్ తలనొప్పి ఉన్నవాళ్లు ఇది తాగితే మంచిది కాదు. నిమ్మకాయ టీలో ఉండే టైరమైన్ అనే పదార్థం కొందరికి మైగ్రేన్ తలనొప్పి వచ్చేలా చేస్తుంది. మైగ్రేన్ ఉన్నవాళ్లు ఇది తాగితే తలనొప్పి ఎక్కువ అవుతుంది. దానివల్ల రోజు చేసే పనుల్లో కూడా ఇబ్బంది వస్తుంది. పేగులో పుండ్లు (అల్సర్లు) ఉన్నవాళ్లు నిమ్మకాయ టీ తాగితే మంట, నొప్పి ఎక్కువ అవుతాయి. నిమ్మకాయలో ఉండే పులుపు ఆ పుండ్లను బాగా ఇబ్బంది పెడుతుంది. దీని వల్ల మరింత అసౌకర్యం కలగవచ్చు.కిడ్నీలో రాళ్లు ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలి. నిమ్మకాయ టీలో ఉండే ఆక్సలేట్ అనే పదార్థం కిడ్నీలో మళ్లీ రాళ్లు వచ్చేలా చేయొచ్చు.


# కాలం చేసిన వారి ఫొటోలు ఇంట్లో పెడుతున్నారా..

**వేద న్యూస్, డెస్క్ :** చనిపోయిన వారి ఫొటోలు ఇంట్లో ఉంచడం గౌరవప్రదమైన ఆచారం. అయితే, వాస్తు శాస్త్ర నియమాలను పాటించడం వల్ల ఈ ఆచారం ఇంట్లో సానుకూల శక్తిని నిలబెడుతుంది. ఫొటోలను సరైన దిశలో, తగిన సంఖ్యలో, గౌరవంగా ఉంచడం ద్వారా కుటుంబం శాంతి, శ్రేయస్సు పొందవచ్చు. ప్రతికూల శక్తిని నివారించడానికి, పడకగది, పూజా గది వంటి స్థలాల్లో ఫొటోలను ఉంచకూడదు. ఇంట్లో చనిపోయిన వారి ఫొటోలు ఉంచడం భారతీయ సంప్రదాయంలో సామాన్యమైన ఆచారం. చాలా మంది తమ వారిపై ఉన్న ప్రేమతో గుమ్మానికి ఎదురుగా కనిపించేలా ఫొటో ఫ్రేములను ఉంచుతుంటారు. ఇంకొందరు దేవుడి గదిలో పెడుతుంటారు. అయితే, ఇలా చేయడం ఎంత వరకు మంచిది? ఈ ఆచారం వెనుక ఆధ్యాత్మిక నమ్మకాలతో పాటు వాస్తు శాస్త్రం కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. చనిపోయిన వారి ఫొటోలు ఇంట్లో ఉంచడం వల్ల పూర్వీకుల జ్ఞాపకాలు నిలిచి ఉంటాయి. కుటుంబ సభ్యులు వారి సానుకూల గుణాలను గుర్తుచేసుకుంటారు. ఈ ఆచారం పూర్వీకుల పట్ల గౌరవాన్ని చూపిస్తుంది. వాస్తు శాస్త్రం ప్రకారం, ఫొటోలను దక్షిణ గోడపై ఉత్తరం వైపు చూసేలా ఉంచడం వల్ల వారి ఆత్మకు శాంతి చేకూరుతుంది. ఇది ఇంట్లో వారసత్వ భావాన్ని కాపాడుతుంది. కుటుంబ సభ్యులకు మనసు నెమ్మదిని ఇస్తుంది. కొన్ని నమ్మకాల ప్రకారం, పూర్వీకుల ఆశీస్సులు కుటుంబానికి శ్రేయస్సును తెస్తాయి. వాస్తు శాస్త్రం ప్రకారం, చనిపోయిన వారి ఫొటోలను సరైన స్థలంలో ఉంచకపోతే ఇంట్లో శక్తి సమతుల్యత దెబ్బతినవచ్చు. పడకగది, పూజా గది, లేదా ప్రధాన గదుల్లో ఫొటోలు పెట్టడం మంచిది కాదు. ఇది కుటుంబ సభ్యుల మనసులో బాధ, భయం కలిగించవచ్చు. ఫొటోలు ఎక్కువగా ఉంచడం వల్ల ఇంట్లో ప్రతికూల శక్తి పెరిగే అవకాశం ఉందని వాస్తు నిపుణులు హెచ్చరిస్తారు. పూజా గదిలో దేవుళ్లతో పాటు ఈ ఫొటోలను ఉంచి పూజించడం కూడా సరికాదు. ఇది దేవతల ఆగ్రహానికి కారణం కావచ్చని నమ్ముతారు. చనిపోయిన వారి ఫొటోలను ఉంచేటప్పుడు వాస్తు శాస్త్రం కొన్ని నియమాలను సూచిస్తుంది. ఫొటోలను దక్షిణ గోడపై ఉత్తరం వైపు చూసేలా



వేలాడదీయడం ఉత్తమం. ఇలా చేయడం వల్ల ఆత్మకు శాంతి లభిస్తుందని నమ్మకం. ఒకటి లేదా రెండు ఫొటోలను మాత్రమే ఎంచుకుని, జాగ్రత్తగా ఉంచడం మంచిది. ఫొటోలను శుభ్రంగా ఉంచి, గౌరవంగా చూసుకోవాలి. పగిలిన ఫ్రేములు లేదా దెబ్బతిన్న ఫొటోలను వెంటనే తొలగించాలి. ఇంటి ప్రధాన గదుల్లో ఫొటోలను ఎక్కువగా ప్రదర్శించకూడదు. ఆధ్యాత్మిక దృక్కోణంలో, చనిపోయిన వారి ఫొటోలు ఇంట్లో ఉంచడం వల్ల కుటుంబం వారి ఆత్మలతో సంబంధాన్ని కొనసాగిస్తుంది. కొన్ని సంప్రదాయాల్లో, ఈ ఫొటోల వద్ద దీపం వెలిగించడం వల్ల ఆత్మకు శాంతి చేకూరుతుందని చెబుతారు. ఈ ఆచారం కుటుంబ సభ్యులకు మానసిక బలాన్ని ఇస్తుంది. అయితే, ఈ ఫొటోలను దేవుళ్లతో సమానంగా పూజించడం సరికాదని ఆధ్యాత్మిక గురువులు సూచిస్తారు.

# విల్లు వంటి ఒంపులతో సొగసు బాణాలు సంధిస్తున్న ఈషా రెబ్బ..



**వేద న్యూస్, డెస్క్ :**
తన అందం, అభినయంతో కుర్రకారు మనసు దోచేయడం ఈమె ప్రత్యేకత. తెలుగు సినిమాల్లో హీరోయిన్ గా, సహాయనటిగా ఎన్నో సినిమాల్లో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగమ్మాయిగా తనకంటూ ఇండస్ట్రీలో ఓ మంచి గుర్తింపును సంపాదించుకుంది ఈ వయ్యారి. ఆమె ఎవరో కాదు.. ఓరుగల్లు పిల్ల ఈషా రెబ్బ. ఈమె కెరీర్, ఎడ్యుకేషన్, పుట్టినరోజు వంటి కొన్ని విషయాలు తెలుసుకుందాం..

19 ఏప్రిల్ 1990 తెలంగాణలోని చారిత్రాత్మక నగరం వరంగల్ లో ఓ తెలుగు హిందూ కుటుంబంలో జన్మించింది అందాల భామ ఈషా రెబ్బ. ఈమె పెరిగింది మాత్రం హైదరాబాద్ నగరంలోనే. ఈ వయ్యారి వరంగల్ హయ్యర్ సెకండరీ స్కూల్ లో పాఠశాల విద్యను అభ్యసించింది. మాస్టర్స్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లో డిగ్రీ పట్టా పొందింది. 2012లో లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమాతో తెరంగేట్రం చేసింది. అయితే హీరోయిన్ గా కెరీర్ మొదలైంది మాత్రం ఇంద్రగంటి మోహన్ కృష్ణ దర్శత్వంలో వచ్చిన అంతక ముందు సినిమాతో.. ఇందులో సుమంత్ అశ్విన్ హీరో.


తర్వాత రొమాంటిక్-కామెడీ చిత్రం అమీ తుమీలో కథానాయకిగా మెప్పించింది. ఇందులో ఆమె నటనకు విస్తృత స్పందన లభించింది. మూడు అవార్డులు కూడా లభించాయి. మాయా మాల్, దర్శకుడు, అ!, బ్రాండ్ బాబు వంటి చిత్రాల్లో నటించింది. తర్వాత ఎన్టీఆర్ హీరోగా వచ్చిన అరవింద సామెత వీర రాఘవ నుంచి సెకండ్ హీరోయిన్ గా మారింది ఈ వయ్యారి. తర్వాత కొన్ని చిత్రం కూడా సెకండ్ హీరోయిన్?గా నటించి మెప్పించింది ఈ వయ్యారి భామ. 2023లో మామా మశ్చీంద్రలో మరోసారి కథానాయకిగా కనిపించింది. 3 రోజెస్, పిట్టా కథలు, మాయ బజార్ ఫర్ సేల్, దయ వంటి వెబ్ సిరీస్ ల్లో కూడా నటించింది. ప్రస్తుతం 3 రోజెస్ సీజన్ 2లో నటిస్తుంది.

## కొత్త కబుర్లు పంచుకున్న న్యాచురల్ స్టార్



**వేద న్యూస్, డెస్క్ :** హిట్ 3 ది థర్డ్ కేస్ మొదటి వారంలోనే వంద కోట్ల గ్రాస్ దాటేసి విజయవంతంగా రెండో వారంలోకి అడుగు పెట్టేసింది. ఇండో పాక్ సరిహద్దుల్లో ఏర్పడిన యుద్ధ వాతావరణం వల్ల సినీ సెలబ్రిటీలు వీలైనంత ఈవెంట్లు లేకుండా చూసుకుంటున్నారు కానీ న్యాచురల్ స్టార్ నాని ఈ రోజు హిట్ 3 సక్సెస్ మీట్ పెట్టి ఇలా చేయడం వెనుక ఉద్దేశంతో పాటు కొత్త కబుర్లు పంచుకున్నాడు. పాకిస్థాన్ కు చాలా పద్ధతిగా ఇండియన్ ఆర్మీ బుద్ధి చెబుతోందని, శత్రుదేశం వల్ల ఒక భారతీయ సినిమా సెలబ్రేషన్ చేయలేదనే కారణం వాళ్లకు ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే టీమ్ అందరితో డిస్కస్ చేసి ఇది ఏర్పాటు చేసినట్టు వివరించాడు. ఇక విశేషాల వైపు చూస్తే హిట్ 4లో ఏసిపి వీరప్పన్ గా చేయబోతున్న కార్తీతో ఏదో పెద్దదే ప్లాన్ చేస్తున్నాడు నాని. ఇంకా సినిమా చూడాల్సిన వాళ్ళు చాలా ఉన్నారు కాబట్టి ఎక్కువ డీటెయిల్స్ రివీల్ చేయలేదు. మిక్కీ జె మేయర్ ని తీసుకోవడం గురించి కామెంట్స్ వచ్చాయని, ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్స్ కి అతను ఎలా న్యాయం చేస్తాడని అన్నారని, కానీ ఇలాంటి వాటికి గతంలో పని చేసిన వాళ్ళను కాకుండా ఒక ఫ్రెష్ సౌండ్ కోసం మిక్కీని తీసుకొచ్చామని, అదిప్పుడు మంచి ఫలితాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశాడు. శైలేష్ కొలనుతో కామెడీ సినిమా ఉండొచ్చని, కాకపోతే ఎప్పుడనేది చెప్పలేనని అన్నాడు. ఈ వీకెండ్ కి హిట్ 3కి కీలకం కానుంది. కొత్త రిలీజులు సింగిల్, శుభంకు డీసెంట్ టాక్ వచ్చినప్పటికీ అవి మాస్ ని టార్గెట్ చేసినవి కాకపోవడంతో నానికి మరో ఛాన్స్ దక్కింది. ఎలాగూ ఆడియన్స్ కి ఎక్కువ ఆప్షన్స్ లేవు. బుకింగ్స్ మళ్ళీ ఊపందుకున్న వైనం బుక్ మై షోలో కనిపిస్తోంది. దీన్ని ఇంకాస్త బలంగా పుష్ చేసే ఉద్దేశంతో నాని విజయోత్సవం చేసుకున్నాడు.

## మీనమేషాలు లెక్కబెడుతున్న స్టారర్



**వేద న్యూస్, డెస్క్ :** చెప్పుకోదగ్గ క్యాస్టింగ్ ఉంది. విడుదల తేదీ ప్రకటిస్తే బిజినెస్ జరిగిపోతుంది. కానీ భైరవం టీమ్ మీనమేషాలు లెక్కబెడుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కలయికలో రూపొందిన ఈ విలేజ్ డ్రామాని మరీ ఆర్ఆర్ఆర్ రేంజ్ లో మల్టీస్టారర్ అనలేం కానీ మినీ స్టారరని చెప్పొచ్చు. ఆల్రెడీ ఒక పాట చార్ట్ బస్టర్ అయ్యింది. పోస్టర్లు, టీజర్ జనంలో ఆసక్తిని పెంచాయి. తమిళ సూపర్ హిట్ గరుడన్ రీమేక్ గా రూపొందిన భైరవంకు నాంది ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వం వహించారు. శంకర్ కూతురు అదితి శంకర్ టాలీవుడ్ కు హీరోయిన్ గా పరిచయమవుతోంది. అన్నీ బాగానే ఉన్నా ఎలాంటి చప్పుడు చేయకుండా భైరవం ఇంత మౌనంగా ఎందుకు ఉందనే సందేహం రావడం సహజం. మంచు విష్ణుతో ఉన్న విభేదాల దృష్ట్యా కన్నప్పకు పోటీగా ఈ సినిమాని రిలీజ్ చేయాలని మనోజ్ పట్టుబడుతున్నట్టుగా ఒక వెర్షన్ ఉంది. అదే నిజమైతే జూన్ 27 అని ప్రకటించేయాలి. కానీ అలా జరగలేదు. వాస్తవమేంటో టీమ్ కే తెలుసు. ఇంకో వైపు ఓటిటి డీల్ ఎంతకీ తెగకపోవడం వల్లే నిర్మాత డేట్ వేయలేకపోతున్నారని ఇన్ సైడ్ టాక్. ఆశించిన దానికన్నా తక్కువ మొత్తం ఆఫర్ చేయడం వల్ల వేచి చూసే ధోరణిలో ఉన్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే డిలే వల్ల బజ్ తగ్గడం మొదలయ్యింది. చూస్తుంటే మేలో రావడం దాదాపు అసాధ్యమే. వచ్చే వారం స్లాట్ ఖాళీగా ఉన్నా భైరవం యూనిట్ నుంచి ఎలాంటి సౌండ్ లేదు. నెలాఖరులో 30న విజయ్ దేవరకొండ కింగ్ డమ్ ఉంది. ప్రస్తుతానికి వీళ్ళు అదే తేదీకి కట్టుబడ్డారు. ఒకవేళ పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు వస్తే వాయిదా పడొచ్చు. అది కూడా ఇంకా తేలలేదు. జూన్ 20 కుబేర, సితారే జమీన్ పర్ ఉన్నాయి. ఆపై వారం 27 కన్నప్ప దిగుతాడు. అటుపై జూలైలో ఇంకా కష్టం. ఇంత స్పష్టంగా సమీకరణాలు కనిపిస్తుంటే భైరవం ఇంకా విడుదల తేదీ దోబూచులాడటం గమనార్హం. ఎక్కువ ఆలస్యం చేసినా ఉన్న బజ్ తగ్గిపోయే ప్రమాదముంది.




## ‘థగ్‌లైఫ్’ ఆడియో వేడుక వాయిదా

**వేద న్యూస్, డెస్క్ :** కథానాయకుడు కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం ‘థగ్‌లైఫ్’. ఈనెల 16న ఈ సినిమా ఆడియో వేడుక చెన్నైలో జరగాల్సివుంది. భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కమల్‌హాసన్ ప్రకటించారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ‘ఆర్ట్ కెన్ వెయిట్%ొ% ఇండియా కమ్స్ ఫస్ట్’ అనే శీర్షికతో ఒక ప్రకటన విడుదల చేశారు. ‘మన దేశ సరిహద్దులో జరుగుతున్న పరిణామాలు, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మే 16న జరగాల్సిన ‘థగ్‌లైఫ్’ ఆడియో విడుదలను వాయిదా వేస్తున్నాం. తిరిగి షెడ్యూల్ వివరాలను తెలుపుతాం. మన సైనికలు మన మాతృభూమి పరిరక్షణలో అంచంచలమైన ధైర్యంతో ముందు వరుసలో ఉండి పోరాటం చేస్తున్నారు. ఇది నిశ్శబ్ధ సంఘీభావం కోసం నిర్ణయం తీసుకుంటున్నాం. వేడుకలకు ఇది సరైన సమయం కాదని నేను నమ్ముతున్నా. కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తాం’ అని ఆయన పేర్కొన్నారు. ‘నాయగన్’ (1987) వంటి హిట్ మూవీ తర్వాత 38 సంవత్సరాలకు మళ్లీ కమల్‌హాసన్-మణిరత్నం కాంబినేషన్‌లో ‘థగ్‌లైప్’ సినిమా రానుంది. శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యాలక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఉదయనిధి స్టాలిన్, ఆర్.మహేంద్రన్‌బీ శివ అనంత్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన నిర్మించిన ఈ సినిమా జూన్ 5న విడుదల కానుంది. ఎఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా, రవి కె చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

వేద న్యూస్

మంగళవారం మే 13, 2025



## గౌతమ బుద్ధుని జీవితం అందరికీ ఆదర్శం

**వేద న్యూస్, మిర్యాలగూడ రూరల్ :**

గౌతమ బుద్ధుని జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అవంతిపురం గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జాను నాయక్ అన్నారు. సోమవారం బుద్ధ 2569వ, జయంతి సందర్భంగా కళాశాలలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంగ్ల అధ్యాపకులు రాజరత్నం మాట్లాడుతూ సమస్త దుఃఖానికి మూల కారణం కోరికలని కోరికలను జయించినప్పుడే మానవుడు ప్రశాంతంగా జీవించగలుగుతాడు అన్న బుద్ధుని బోధనలు ప్రతి ఒక్కరు అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగయ్య, నవీన్‌పాల్గొన్నారు.



## కంచి కామకోటి పీఠం ధర్మాధికారికి ఘన సన్మానం

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

కంచి కామకోటి పీఠం ధర్మాధికారి అరవింద సుబ్రమణ్యం సోమవారం గడ్డి అన్నారం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంకు విచ్చేసిన సందర్భంగా దేవాలయ చైర్మన్ పూరనరసింహ గుప్తా, పాల్తి శ్రీనివాస్, వక్క లంక శ్రీనివాస రావు వసంత మనోహర్ ఎస్సార్ శ్రీనివాస బచ్చు సత్యనారాయణ లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన వక్క లంక శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ లో,అన్నవరం, తెలంగాణలో గడ్డి అన్నారం, వీర వెంకట సత్యనారాయణ స్వామి కృపకు పలువురు ప్రజలు పాత్రులు అవుతున్నారని అన్నారు. అదే విధంగా దేవాలయ చైర్మన్ ఊర నరసింహ గుప్తా ఈనెల 18న జరిగే ఎన్నికల గురించి అదేవిధంగా ఈనెల 28వ తేదీనాడు 108 వెండి కలశాలతో అభిషేక కార్యక్రమం ఉంటుందని ధర్మాధికారికి తెలిపారు. ఈ కార్యక్రమానికి కంచి కామకోటి పీఠం ధర్మాధికారి అరవింద సుబ్రహ్మణ్యం హాజరు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.



## లారీ ఢీకొని వ్యక్తి మృతి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మండల పరిధిలోని తుంగపాడు గ్రామం వద్ద లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సోమవారం వెలుగు చూసింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం కంపాలపల్లి గ్రామంకు చెందిన నాగెల్లి రాములు (80 సం) అను వ్యక్తి చెన్నాయిపాలెం గ్రామంలోని తన మనవరాలు ఇంటికి వెళ్లడం కోసం తుంగపాడు గ్రామంలో ఆటో దిగి రోడ్డు దాటుతుండగా, హాలియా వైపు నుండి మిర్యాలగూడ వైపుగా వస్తున్న లారీ అతివేగంగా ఢీకొనడం జరిగింది.నాగెల్లి రాములు తలకు కాళ్లు,చేతులకు బలమైన గాయాలు కాగా చుట్టుపక్కల వారు గమనించి 108 కి ఫోన్ చేసి చికిత్స నిమిత్త మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.ఆసుపత్రిలో చికిత్స చేస్తుండగా సోమవారం ఉదయం 11 గంటల 45 నిమిషాలకు చనిపోవడం జరిగింది.మృతుని కుమారుడు నాగెల్లి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.



## వీర జవాన్ కు పాత్రికేయుల ఘన నివాళి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

భారత్ - పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ ఎం.మురళి నాయక్ కు మిర్యాలగూడ పాత్రికేయులు ఘన నివాళులు అర్పించడం జరిగింది.పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో భారత జవాన్ ఎం.మురళి నాయక్ మృతి చెందడం పట్ల మిర్యాలగూడ పట్టణ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విచారం వ్యక్తం చేసింది.ఆయన మృతికి సంతాపం ప్రకటించి,సోమవారం అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప ఘనత జవాన్ మురళి నాయక్ కు చెందుతుందని, ఆయన మరణం దేశ చరిత్ర పుటలో లిఖించబడుతుందని, జవాన్ కుటుంబానికి విలేఖరుల తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు అయూబ్, మంద సైదులు,గుండా మహేష్, జయరాజ్, అశ్లం, మట్టయ్య,జంగా లక్ష్మణ్,చారి,నజిమ్,హమిద్,విరగాని లక్ష్మణ్, నాగభూషణం, అలుగుబెల్లి వెంకట్,కొత్తపల్లి సైదులు,నక్క శ్రీను,కె.నరసింహ,శివకృష్ణ,మంద లక్ష్మణ్,నగేష్,హరీష్,శ్యామ్ భరత్,సుదర్శన్,రాజశేఖర్,జగన్‌పాల్గొన్నారు.

# జన హితం కోసమే జన విజ్ఞాన వేదిక

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి**



మనిషి మనుగడకు ఆహారపు అలవాట్లు ప్రధాన కారణమని, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ఆయుః ప్రమాణాన్ని పెంచుకొనే అవకాశం ఉందని జన విజ్ఞాన సీనియర్ నాయకులు పాధురి రమణా రెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండల పరిధిలోని చిల్లపురం, ఐలాపురం,పెద్ద దేవులపల్లి గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేసే వారి వద్దకు వెళ్లి ఆరోగ్య విషయాలు చెబుతూ, ఉపాధి హామీ పనుల నాణ్యత పెంచాలని,వేసవి దృష్టిలో ఉంచుకొని వీలయినంత వరకు ఉదయం తొందరగా వెళ్లి పనులు చేసుకొని ఎండ సమయానికి ముగించు కోవాలని సూచించారు. అదే విధంగా పక్షవాతము, మూర్చలు, బీపీ, షుగర్ వ్యాధి ఉన్న నిరుపేదలకు మిర్యాలగూడ పట్టణం హెసింగ్ బోర్డు లోని నవ జ్యోతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ నందు ప్రముఖ నరాల వైద్యులు గోపాలం శివన్నారాయణచే పరీక్షించి, రోగినుండి నెలకు 75 రూపాయలు,నాలుగు నెలలకు కలిపి 300 రూపాయలు నామమాత్రంగా తీసుకొని దాతల సహకారంతో 4 నెలలకు వారికి అవసరమయ్యే మందులు అందజేస్తున్నామని,ఇట్టి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ వంట నూనెల వాడకం ప్రతీ నెల బాగా పెరుగుతుందని,మార్కెట్ లో దొరికే నూనెలకన్నా,వేరు శనగలు నువ్వులు, కుసుమలు, కొబ్బరి వంటి వాటిని గానుగలలో ఆడించి తీసిన నూనెలు వాడాలని, వంటకు అల్యూమినియం పాత్రలు వాడినట్లయితే అవి కరిగి మనం తినే ఆహారంలోకి వెళ్లి ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉన్నందున స్టీలు,ఇనుప పాత్రలు వంటకు ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ జేవివి నాయకులు,ఉపాధ్యాయ సంఘము జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాస చారీ మాట్లాడుతూ కృత్రిమ శీతల పానీయలు అయిన కూల్ డ్రింక్స్ ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి,తియ్య ధనం కోసం దానిలో రసాయన పాదర్థాలు వాడుతున్నారని వాటిని తాగడం వలన అల్సర్ లు, కాలేయ సంబంధిత రోగాలు వచ్చే అవకాశం ఉందని వాటిని త్రాగడం మానివేసి సహజ పానియాలు అయిన పళ్ళ రసాలు,మజ్జిగ, షర్బత్ వంటి వాటిని సేవించాలని,విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని,ప్రభుత్వ ఆస్పత్రులలో రక్త పరీక్షలు చేయించుకొని తమ ఆధాయాన్ని ఆధా చేసుకోవాలని కోరారు. మరో సీనియర్ జేవివి నాయకులు మోర్తల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంచే గుర్తించ బడిన జెనరిక్ మందులను వాడాలని, వాణిజ్య ప్రకటనలు చూసి మోసపోవద్దని, వేసవిలో ఎండ రాకముందే ఆరుబయట పనులు ముగించుకొని,వీలయినంత వరకు ఎక్కువ నీటిని తీసుకొని వడ దెబ్బ ప్రమాదానికి గురికా కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు,ఉపాధి హామీ పథకం సేవకులు పాల్గొన్నారు.

# భావిభారత పౌరులు దృఢంగా ఉండాలి

- తల్లిదండ్రులు, గురువులు చెప్పేది బుద్ధిగా నేర్చుకోవాలి
- బాధ్యతగల పౌరులుగా, అందరికీ మంచి పేరు తెస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలి
- ఆటలు మేధస్సును పెంచుతాయి
- జిల్లా ఎస్పీ నరసింహ

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**



వేసవి సెలవుల సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట పట్టణంలో జిల్లా పరిషత్ పాఠశాల పిల్లలకు వేసవి ఉచిత శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు జిల్లా బాల భవన్ ఆధ్వర్యంలో ఎస్పీ నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు, కాలనీ పిల్లల కోసం ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించామని దీనిలో పిల్లలకు మేధస్సు, జ్ఞాపకశక్తి, ప్రయోగాత్మక విధానం పెంపొందించే విధంగా ప్రయోగాత్మక ఇంటలిజెన్స్, యోగ, క్రాఫ్ట్, మ్యూజిక్, కర్రసాము, సాంప్రదాయ నృత్యం, సంగీత పరికరాలు, ఇండోర్ ఆటలు మొదలగు అంశాల గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాఠశాల పిల్లలు ఎవరైనా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. పిల్లలు భావిభారత పౌరులు, బావి భారత పౌరులు దృఢంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు గురువులు చెప్పేది బుద్ధిగా నేర్చుకోవాలని సూచించారు. మేధస్సును, జ్ఞాపకశక్తిని పెంచే ఆటలపై దృష్టి పెట్టి అలాంటి ఆటలు ఆడుకోవాలి, పిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మంచి స్నేహితులను అలవర్చుకోవాలన్నారు. గురువుల నేర్పే సద్విద్యాను జ్ఞాపకశక్తితో కూడిన అలవాట్లను మంచిగా నేర్చుకుని కృషిచేసి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పోలీసులు సమాజ రక్షణకోసం ఉన్నారు, సైనికులు నిజమైన హీరోలు అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిన, దొంగతనాలు, అసాంఘిక చర్యలు, విద్యాసంస్థల్లో వేదింపులు ఇలా ఏవైనా స్థానిక పోలీస్ లకు, డయల్ 100 కు తెలపాలి అని విద్యార్థులకు తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు, అన్ని రంగాల్లో రాణిస్తున్నారు, ఆపరేషన్ సిందూర్ ను ముందుకు తీసుకెళ్ళి విజయవంతం చేసినది ఇద్దరు మహిళా అధికారులే. అంతరిక్షానికి వెళ్లి ప్రయోగాలు చేస్తున్నారు, పిల్లలు మంచి భవిష్యత్తులో స్థాయికి వెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం రిఫ్రెష్మెంట్ కోసం పిల్లలకు పండ్లు, బిస్కెట్ అందించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ పార్థసారథి, జిల్లా బాల భవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణా రెడ్డి, భాల భవన్ సభ్యులు రిటైర్డ్ అధ్యాపకులు అమిథ్ ఖాన్, యోగా గురువు, జిల్లా బాల భవన్ ఉపాద్యాయులు పాల్గొన్నారు.

## బీజేపీకి కొత్త మండల అధ్యక్షుల నియామకం

**వేద న్యూస్ జ్యోతి నగర్,ఎన్టీపీసీ:**



పెద్దపల్లి జిల్లా రామగుండం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సంస్థాగత పరంగా కీలక నిర్ణయం తీసుకుంది. రామగుండం నియోజకవర్గంలోని మూడు మండలాలకు కొత్త అధ్యక్షులను సోమవారం ప్రకటించారు. ఈ నియామకాలను జిల్లా బీజేపీ అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి అధికారికంగా ప్రకటించారు.నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు: ఎన్టీపీసీ మండలం: మిట్టపల్లి సతీష్ కుమార్,తిలక్ నగర్ మండలం: ఐత పవన్ కుమార్,8ఇన్ క్లైన్ కాలనీ మండలం: ఆకుల శశి కుమార్.ఈ ముగ్గురు నేతలు వచ్చే మూడు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారని తెలిపారు. పార్టీ బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకంగా పనిచేయాలని సూచించారు. రానున్న రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని సాధించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి, పార్టీ నేతలు కోమల మహేష్, గాండ్ల ధర్మపురి, మూకిరి రాజు, తోట కుమారస్వామి, మచ్చ విశ్వాస్ మరియు వివిధ మండలాల అధ్యక్షులు అపర్ణ, గుండబోయిన భూమయ్య, కన్నూరి భాస్కర్, మారేపల్లి శ్రీనివాస్, లింగం నాయక్, పొట్ల వెంకటేష్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

**వేద న్యూస్,రామగుండం ఎన్టీపీసీ :**



రామగుండం ఎన్టిపిసి టౌన్షిప్ లోని కంజరవెన్స్ విభాగాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టౌన్ షిప్ లోని సివిల్ ఆఫీస్ వద్ద సోమవారం కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగుల పనిని నూతన కాంట్రాక్టర్ ఆపినారు వారిని వెంటనే వీధిలోకి తీసుకోవాలని ఐఎఫ్టుయు జిల్లా వైస్ ప్రెసిడెంట్ చిలుక శంకర్ కోరారు.60 సంవత్సరాలు పై పడిన వారి స్థానంలో కొంత మంది నీ డిపెండెంట్ ఉద్యోగంలోకి తీసుకున్నారని వారి డీటెయిల్స్ టెండర్ లో పొందుపరచుక పోవడంతో నూతన కాంట్రాక్టర్ వారి పని ఆపినారు. పాత టెండర్ల ప్రకారమే కొనసాగించాలని అన్నారు. అగ్రిమెంట్ ప్రకారం 16 నెలల ఏరియల్సును చెల్లించాలని తెలిపారు. ఇట్టి విషయాలపై ఎన్టిపిసి యాజమాన్యం దృష్టి సారించాలని కోరారు. సంబంధిత అధికారి ఏజీఎం ఉమేష్ చెడ్డ దృష్టికి కార్మికుల సమస్యలు పోవడంతో ఆయన వెంటేనే స్పందించి త్వరలో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు యధావిధిగా విధుల్లోకి హాజరు అయ్యారు.కార్యక్రమంలో సూపర్ వైజర్లు,కార్మికులు తడి తరులు పాల్గొన్నారు.

## అడిషనల్ పిపి కి సన్మానం

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



ఇటీవల మెట్ పల్లి అసిస్టెంట్ సెషన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియామకం అయిన చెర్లపల్లి ఆనంద్ గౌడ్ ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆనంద్ గౌడ్ భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్ న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, బద్దం లక్ష్మా రెడ్డి, బోద లక్ష్మణ్, ఏలేటి రామ్ రెడ్డి, ఒజ్జెల శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ఓగులపు శేఖర్, బక్కూరి రమేష్, రాంపల్లి జగన్, ద్యావని సత్యనారాయణ, రమణ, అనిరుధ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



## మృత్యుఒడి.. బంధన్!

**మొదటి పేజీ తరువాయి**

నష్టపరిహారం చెల్లించినట్టు సమాచారం.

### గతంలో 'బంధన్'పై ఫిర్యాదులు

గతంలో బంధన్ హాస్పిటల్‌లో వైద్యం వికటించిన వారు వైద్యాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. ఆఫీసర్లు గత కంప్లయింట్స్ ఆధారంగా చర్యలు తీసుకొని ఉండుంటే మరో ప్రాణం పోయేది కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు తమ విధులు నిర్వర్తించాలని కోరుతున్నారు. కాసులకు కక్కుర్తిపడి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న బంధన్ హాస్పిటల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తమది ప్రజా ప్రభుత్వం అని పేర్కొంటున్న ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తూ.. రూ. వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ.. రోగుల ప్రాణాలను మాత్రం గాలిలో దీపంలానే చూస్తూ.. కనీసంగా స్పందించని 'బంధన్' ఆస్పత్రిపైన చర్యలు తీసుకోవాలని బాధితులు, నగరవాసులు రిక్వెస్టు చేస్తున్నారు. 'బంధన్' వెనక ఎవరి అండదండలున్నా పట్టించుకోకుండా సర్కారు మానవతాకోణంలో స్పందించాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హాస్పిటల్‌పై తగు చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

## బిజెపి వన్ టౌన్ కార్యవర్గం నియామకం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



భారతీయ జనతా పార్టీ మిర్యాలగూడ వన్ టౌన్ పట్టణ కార్యవర్గాన్ని సోమవారం నియమించినట్లు వన్ టౌన్ అధ్యక్షుడు బంటుగిరి తెలిపారు.బిజెపి నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగవర్షిత్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు,సీనియర్ నాయకులు బంటు సైదులు,అసెంబ్లీ కన్వీనర్ సజ్జల నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తం,కొండేటి సరిత,హనుమంత రెడ్డి,అశోక్ రెడ్డి, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కమిటీసభ్యులను నియమించినట్లు తెలిపారు. మిర్యాలగూడ పట్టణ వన్ టౌన్ కార్యవర్గ సభ్యులు,ఉపాధ్యక్షులుగా పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మోదాల అశోక్,నక్కరవి,నాగుబండి జనాభాయ్,ప్రధాన కార్యదర్శులు గా కొంగరి వెంకటరమణ,మూల రాజిరెడ్డి,కార్యదర్శులు గా మద్ది మల్లేష్,మోహం వెంకటేశ్వర్లు,కోల చంద్రకళ,మండల వజ్రమ్మ,కోశాధికారి చిర్ర రాజులను నియమించడం జరిగింది.నూతన కార్యవర్గ సభ్యులకు వన్ టౌన్ పట్టణ అధ్యక్షుడు బంటుగిరి శుభాకాంక్షలు తెలియజేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073